క్లుప్తంగా

నేడు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చేవెళ్ల: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 9 గంటలకు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించిన 97 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లంపల్లి వీరేందర్‌రెడ్డి మంగళశారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు. మండలాల వారీగా చెక్కులు వచ్చిన వారి జాబితాను ఆయా మండల గ్రామాల నాయకులకు పంపించామని తెలిపారు. ఆయా గ్రామాల పార్టీ నాయకులు చెక్కులు వచ్చిన వారిని తీసుకొని రావాలని కోరారు.

కళాశాల నిర్మాణానికి విరాళం


ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న వినయ్‌రెడ్డి

షాద్‌నగర్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి మంగళవారం కేశంపేట మండలం సంగెం గ్రామానికి చెందిన వినయ్‌రెడ్డి రూ.1లక్షా 11వేలు ఎమ్మెల్యేకు అందజేశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వినయ్‌రెడ్డి ఎమ్మెల్యేకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, ఇబ్రహీం, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ఇబ్రహీం, ముబారక్, సత్యంరెడ్డి, సుదర్శన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

షాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ హెడ్ సురేఖ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి తండాలో ఫౌండేషన్, ఏబీపీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన 70 మంది ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజర్ భద్రయ్య, శిరీష, రమేశ్, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను ఒత్తిళ్లకు గురిచేయొద్దు

పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి


ఎంపీడీఓ అపర్ణకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

షాబాద్: గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, షాబాద్ మండల అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్‌రెడ్డి, కృష్ణ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అపర్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో కుటుంబ సర్వే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై సూపర్‌వైజర్లు ఒత్తిడి చేస్తున్నారని, అనేక రకాల ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ఈ విధంగా ఇబ్బంది పెట్టకుండా ప్రశాంత వాతావరణంలో సర్వే పూర్తిచేసే విధంగా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్షులు సామల మహేందర్‌రెడ్డి, రామ్‌చందర్, వెంకటరమణ, పాషా తదితరులు ఉన్నారు.

అధికారులపై దాడిని ఖండిస్తున్నాం

కందుకూరు: వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులపై దాడి అప్రజాస్వామ్య చర్యగా భావిస్తూ తీవ్రంగా ఖండిస్తున్నామని పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీకాంత్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు ఎన్.రాఘవేందర్, కార్యదర్శి పి.రాజుగౌడ్, కోశాధికారి శ్రీధర్, సభ్యులు సి.వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని, దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అందని ఆసరా!

నాలుగేళ్లుగా కొత్త పింఛన్ల మంజూరు లేదు

- ఆశగా ఎదురుచూస్తున్న నిరుపేదలు
- కొత్త సర్కారు వచ్చినా కదలని ఫైల్

మండలంలో లబ్ధిదారుల వివరాలు ఇలా..	
వృద్ధులు	1,335
దివ్యాంగులు	356
వితంతువులు	1,416
చేనేత కార్మికులు	3
గీత కార్మికులు	8
బీడీ కార్మికులు	3


లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న అధికారులు(ఫైల్)

కొందుర్గు: గత నాలుగేళ్లుగా కొత్తవారెవరికీ పింఛన్ రాకపోవడంతో పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల కాలంగా కొత్తవారికి పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ప్రతీ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులు ఆసరా పింఛన్‌కు దూరమయ్యారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇక తమకు పెన్షన్లు మంజూరవుతుందని ఆశపడిన పేదలకు అడిఆశలే మిగిలాయి. ప్రస్తుతం వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.2016 పింఛన్ వస్తుంది, అదేవిధంగా దివ్యాంగులకు నెలకు రూ.4016 అందుతుంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు అందిస్తామని హామీనిచ్చారు. కానీ ఇంతవరకు ఆ ఊసే లేదు. కాగా అర్హులైన ఎందరో నిరుపేదలు పింఛన్ల కోసం గ్రామాల్లో ఆశగా ఎదురుచూస్తున్నా, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కొత్తవారికి మంజూరు కావడం లేదు.

చనిపోతేనే ఆసరా..

కుటుంబ యజమాని అంటే కుటుంబంలో భర్తకు ఆసరా పింఛన్ వస్తుంటే అనివార్య కారణాలతో మరణిస్తే అతడి స్థానంలో భార్యకు పింఛన్ వస్తుందని అధికారులు అంటున్నారు. కొత్తవారికి మాత్రం పింఛన్ మంజూరు కావడం లేదని చెబుతున్నారు. ఇది గత నాలుగైదేళ్లుగా ప్రభుత్వం వద్దనే పెండింగ్ ఉందని చెబుతున్నారు. ఎవరైనా కొత్తవారు దరఖాస్తు ఇస్తే తీసుకుంటున్నాం తప్పా ఏమి చేయడంలేదని, ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఆప్షన్ లేదని ఎంపీఓ లాలయ్య వివరించారు. ప్రభుత్వం అవకాశం కల్పిస్తే కొత్తవారి నుంచి దరఖాస్తులు తీసుకొని అర్హులైన వారి జాబితా ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన పేర్కొన్నారు.

కాలు పూర్తిగా తీసేశారు



నాకు 58 సంవత్సరాలు. రెండేళ్ల క్రితం అనారోగ్యం కారణంగా వైద్యులు ఆపరేషన్ చేసి ఒక కాలు మొత్తం తీసేశారు. కృత్రిమ కాలుతో కాలం వెల్లదీస్తున్నాను. 2024 జనవరి 9న ప్రభుత్వం సదరన్ క్యాంపు ద్వారా 60 శాతం అంగవైకల్యం ఉన్నట్లు కొండాపూర్ ఏరియా ఆస్పత్రి నుంచి సర్టిఫికెట్ తెచ్చుకున్నాను. కానీ ఇంతవరకు పింఛన్ మాత్రం రావడం లేదు. ఎలాగైనా పింఛన్ ఇప్పించాలని అధికారులను కోరుతున్నాను.

– బంటు నర్సింలు, ముట్పూర్

నేరాల నియంత్రణకు సహకరించాలి

సీఐ నరహరి


పోమాల్‌పల్లిలో దేవాలయం వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ నరహరి

కేశంపేట: ప్రజలు నేరాల నియంత్రణకు సహకరించాలని సీఐ నరహరి అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, వేములనర్వ, కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి, సంగెం గ్రామాల్లో ఉన్న దేవాలయాలను సీఐ నరహరి సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. పుకార్లను, సోషల్ మీడియాలో వచ్చే విషయాలను నిర్ధారణ చేసుకోకుండా సమాచారం చేరవేయొద్దన్నారు. చట్టం పరిధిలో అందరూ సమానమేనని ఆయన తెలిపారు. చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోవద్దని, మీ దృష్టికి వచ్చిన విషయాలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు. దేవాలయాల వద్ద సీసీ కెమెరాలు, విద్యుత్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ప్రిన్సిపాల్ విద్యుల్లత


కబడ్డీ పోటీల్లో తలపడుతున్న విద్యార్థినిలు

షాద్‌నగర్ రూరల్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కమ్మదనం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత పేర్కొన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నారు. మంగళవారం రెండో రోజు 14 గురుకులాల నుంచి 1200 మంది విద్యార్థినులు, 250 మంది బోధన, బోధనేతర సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, చదరంగం, వాలీబాల్, టెన్నికాయిట్, హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహించారు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడా పోటీల్లో పాల్గొన్న ఆయా పాఠశాలల సిబ్బంది, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.


సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారంలో విఫలం

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలయ్యాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు విమర్శించారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ పట్టణ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పరిపాలన కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో తిరిగి అధికారంలోకి రావాలనే ఆలోచనతోనే జమిలి ఎన్నికలను నిర్వహించేందుకు బీజేపీ కుట్రలు పన్నుతుందన్నారు. దేశంలో ఒకేసారి ఎన్నికలను నిర్వహించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలను నిర్వహించేందుకు సీపీఎం శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ఆసరా పెన్షన్, రేషన్ కార్డులను ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రమౌళి, శ్రీనునాయక్, కుర్మయ్య, ఈశ్వర్‌నాయక్, లక్ష్మి, మీనాజ్‌భేగం, పద్మారెడ్డి, ఆంజనేయులుగౌడ్, మహ్మద్‌బాబు, గౌసియా, పారిజాత పాల్గొన్నారు.

అందుబాటులో రేషన్ దుకాణాలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


బండోనిగూడలో రేషన్ సరులకు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: గత కొన్నేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు అందుబాటులోకి రేషన్ దుకాణాలు తీసుకొచ్చామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని బండోనిగూడ, బుగ్గోనిగూడ గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే నూతన రేషన్ దుకాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బండోనిగూడ, బుగ్గోనిగూడ గ్రామాల్లో ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం రేషన్ దుకాణాలను ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఆయా గ్రామాల ప్రజలు రేషన్ సరుకులు తీసుకునేందుకు చేగూరు గ్రామానికి వెళ్లేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రెండు గ్రామాల్లో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పసుల బుచ్చయ్య, బుగ్గ సాలయ్య, జెట్ట శ్రీశైలం, రాజు, తిరుపతి, యాదయ్య, మంకాల శ్రీశైలం, అంజనేయులు, బుగ్గ నర్సింహ, శ్రావణ్, నరేందర్, యాదయ్య, శంకర్, శివ శంకర్, నర్సింహ, దేవల్లి కుమార్, కొమ్ము కృష్ణ, బాల్‌రెడ్డి, కావలి కృష్ణ, నీరటి రవీందర్, జెగ్గ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా సౌకర్యంతోనే అభివృద్ధి

కొత్తూరు: రవాణా సౌకర్యం సక్రమంగా ఉంటేనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలో ఆయన మంగళవారం పలువురు నాయకులతో కలిసి బీటీరోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తుల ఇబ్బందులను పరిష్కరించడానికి సుమారు రూ.92లక్షలతో చింతగట్టు తండా నుంచి పోల్కోనిగుట్టతండా వరకు బీటీరోడ్డు పనులు చేపడుతున్నట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణాలకు దీటుగా గ్రామాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే మారుమూల గ్రామాలకు సైతం రోడ్డు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. రవాణా సౌకర్యం బాగుంటేనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. విడతల వారీగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వెళ్లే రోడ్లను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లారం శేఖర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, అంబటి ప్రభాకర్, ఖాజా, జంగయ్య, కొమ్ము కృష్ణ, సురేశ్, చందర్‌నాయక్, గోపాల్, రెడ్యా, హర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సమగ్ర సర్వే

- ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు
- సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్లు, ఎంపీడీఓలు


చేవెళ్ల: ఇంద్రారెడ్డినగర్‌లో సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్ భారతి

చేవెళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే విజయవంతంగా కొనసాగుతోందని ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం జరుగుతున్న సర్వేను మండల సూపర్‌వైజర్లు పరిశీలించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల వద్ద నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రజలు కూడా సర్వేకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారన్నారు. నాలుగోరోజు మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే ప్రశాంతంగా కొనసాగిందన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న వెంటనే ఎన్యుమరేటర్లకు సూపర్‌వైజర్‌లు సహాయం అందిస్తున్నారన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా పక్కా సమాచారంతో పారదర్శకంగా సర్వేను కొనసాగించేలా ఎన్యుమరేటర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. సర్వే అనంతరం డేటా ఎంట్రీ కోసం కూడా తగిన ఏర్పాట్లు మండల కేంద్రంలో చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెలాఖరు వరకు సర్వే పూర్తిచేసేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రజలు కూడా స్వచ్ఛందంగా సర్వేకు సహకరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే సర్వేకు సహకరించాలని ప్రజలను కోరుతున్నట్లు చెప్పారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

కందుకూరు: వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులతో రైతులు లబ్ధి పొందాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ మంగళవారం రైతు వేదికలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ ద్వారా శాస్త్రవేత్తలు అందించే సలహాలు, సూచనలతో పాటు నూతన వంగడాలు, సాగు పద్ధతులు, యంత్ర పరికరాలు వివరాలు తెలుసుకోవచ్చన్నారు. లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే పురుగు మందులు, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి బిల్లులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణమోహన్, ఏఈఓలు ఎల్.రాజు, జగదీశ్వరాచారి, రాఘవేంద్రాచారి, శ్రీహరి, సమీయుద్దీన్, నర్మద, రైతులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు

షాద్‌నగర్ రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులను దూషించిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన క్యాదర్శి బుద్దుల జంగయ్య మాట్లాడుతూ.. జిల్లేడ్‌చౌదరిగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న పాండు రంగాగౌడ్ జీపీ కార్మికులను కులం పేరుతో దూషిస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు మాత్రమే జీపీ కార్మికులుగా పని చేస్తున్నారన్నారు. దళిత, గిరిజన వర్గాలకు చెందిన కార్మికులు ప్రజల కోసం తమ ప్రాణాలను లెక్క చేయకుండా పారిశుద్ధ్య పనులు చేస్తున్నారని, పల్లెలను పరిశుభ్రంగా ఉంచడంలో గ్రామపంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. అలాంటి గ్రామ పంచాయతీ కార్మికులను కార్యదర్శి కులం పేరుతో ఇష్టానుసారంగా దూషించడం సరైనదికాదన్నారు. మహిళా కార్మికులు అనే గౌరవం లేకుండా వారిని తిట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దళిత, గిరిజన వర్గాలకు చెందిన జీపీ కార్మికులు అవమానాలు భరిస్తూ విధులు చేపడుతున్నారన్నారు. సదరు పంచాయతీ కార్యదర్శి వ్యవహారంపై గతంలో పలుమార్లు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశామని, అయినా ఆయన తీరు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శి అలా మాట్లాడటం సరికాదని, దూషించిన ఘటనపై విచారణ చేయించి మీకు న్యాయం చేస్తానని హామీనిచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో జీపీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి వీరేశ్, పంచాయతీ కార్మికులు జంగయ్య, పాపయ్య, లక్ష్మమ్మ, పార్వతమ్మ, బాలమ్మ, బుచ్చయ్య, జంగయ్య, పెంటయ్య తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌పై దాడి హేయమైన చర్య

డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి

చేవెళ్ల: వికారాబాద్ జిల్లాలోని దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేసేందుకు వెళ్లిన జిల్లా కలెక్టర్, అధికారులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి అన్నారు. చేవెళ్లలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కావాలనే ఈ దాడులకు పాల్పడినట్లుగా స్పష్టంగా తెలుస్తోందన్నారు. గతంలో బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన భూసేకరణలు, ప్రజాభిప్రాయ సేకరణలకు కూడా ప్రజలు పెద్ద ఎత్తున వ్యతిరేకించిన ఇలాంటి దాడిచేసే పరిస్థితి జరగలేదన్నారు. ఆ రోజు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు న్యాయం చేయాలని మద్దతు తెలిపారు కాని దాడి చేసేలా రెచ్చగొట్టలేదని విమర్శించారు. కానీ నేడు అదే బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఇప్పుడు ప్రజలను రెచ్చగొట్టి ప్రజల ముసుగులో ఉండి అధికారులపైనే దాడి చేయటం సిగ్గుచేటు అన్నారు. ప్రజాప్రయోజనాల కోసమే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అక్కడి రైతులు చాలా మంది స్వాగతించారని గుర్తించాలన్నారు. కావాలని కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉద్దేశ పూర్వకంగానే ఈ దాడికి పాల్పడ్డారన్నారు. రైతులతో మాట్లాడాలని కలెక్టర్‌ను, అధికారులను కావాలనే గ్రామానికి తీసుకెళ్లిన బీఆర్‌ఎస్ నాయకుడు అక్కడ వారిపై దాడి చేయించాడని ఆరోపించారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని ప్రభుత్వం ఉపేక్షించకూడదన్నారు. ఏమి తెలియని రైతులను వారి స్వార్థ రాజకీయాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు బాధాకరమన్నారు. ప్రభుత్వం రైతులకు, ప్రజలకు న్యాయం చేసే విధంగానే చర్యలు తీసుకుంటుందని గుర్తించాలన్నారు.

ఎన్యుమరేటర్ల సమస్యలు పరిష్కరించాలి


ఎంపీడీఓ సంధ్యకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

మొయినాబాద్ రూరల్: ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన కులగణన సర్వేలో ఎన్యుమరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు జక్కని బందయ్య పేర్కొన్నారు. మంగళవారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సంధ్యకు పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం పక్షాన ఎన్యుమరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జక్కని బందయ్య మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో కుల గణనపై ప్రజలకు అర్థం కాకపోవడంతోనే ఎన్యుమరేటర్లకు సరైన సమాచారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. వారికి అవగాహన కల్పిస్తే సమస్యలు లేకుండా ఎన్యుమరేటర్లు సకాలంలో కులగణన పూర్తి చేయగలుగుతారన్నారు. ప్రజలు కావాలని అన్ని విషయాలు తెలిసి కూడా కొన్ని గ్రామాల్లో మద్యం మత్తులో దుర్భాషలాడే వారిని, సమాచారం ఇవ్వకుండా వేధించే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక్కొక్క ఎన్యుమరేటర్‌కు 150 కుటుంబాలు ఇచ్చారని, కానీ క్షేత్రస్థాయిలో కుటుంబాల సంఖ్య 150–200 వరకు పెరిగిపోయాయని సూచించారు. అధికారుల ఒత్తిడితో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. వారంరోజుల పాటు పాఠశాలలకు సెలవు ఇచ్చి అయినా లేదా ఎన్యుమరేటర్ల సంఖ్యను పెంచితే సకాలంలో కులగణన పూర్తిచేస్తారని మండల అభివృద్ధి అధికారిని కోరారు. ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా అధికారులు పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, హిమాయత్‌నగర్ పాఠశాల హెచ్‌ఎం అంజనేయులు, సత్యనారాయణరెడ్డి, రాములు, లక్ష్మణ్, శివకుమార్, జిల్లా బాధ్యులు వినోద్, మహమూద్, మండల అసోసియేట్ అధ్యక్షుడు రాములు తదితరులు పాల్గొన్నారు.